

వనపర్తి ఎస్పీగా గిరిధర్



వనపర్తి క్రైమ్, జూలై 10: వనపర్తి ఎస్పీగా ఆర్.గిరిధర్ నియామకమయ్యారు. ఈ మేరకు చీఫ్ సెక్రటరీ శాంతకుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన గిరిధర్ స్వస్థలం కరీంనగర్. ప్రస్తుతం హైదరాబాద్ ఈస్ట్ జోన్ డీసీపీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్పీ కె.రక్షిత మూర్తి సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ డీసీపీగా బదిలీ అయ్యారు. రక్షితమూర్తి 2023 జనవరి 26న జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. 18 నెలలు విధులు నిర్వహించారు.

వచ్చే బడ్జెట్‌లో.. నిధులు

- 2024, 2025లలో ఫండ్స్ కోసం ప్రతిపాదనలు
- త్వరలో ప్రవేశపెట్టే పద్దు నేపథ్యంలో వరుస సమీక్షలు
- పాలమూరులో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడమే ప్రధాన లక్ష్యం
- నెట్టెంపాడుకు మరో రూ.231 కోట్ల నిధులు అవసరం
- తుమ్మిళ్లకు రూ.558 కోట్లు, గట్టు లిఫ్ట్‌కు రూ.362 కోట్లు..
- కల్వకుర్తి పనులకు రూ.440 కోట్లు అవసరమవుతాయని అంచనా
- అన్ని పెండింగ్ పనులకు తాజా అంచనాలు ఫైనల్





మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం

మహబూబ్‌నగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం నీటిపారుదల ప్రాజెక్టులను పరుగులు పెట్టించే దిశగా అడుగులు వేస్తోంది. అందులో భాగంగా తక్కువ ఖర్చుతో.. ఎక్కువ ఆయకట్టుకు నీరందించే ప్రాజెక్టుల పూర్తికి నడుం బిగించింది. మొత్తం ఇరిగేషన్ ప్రాజెక్టులను ఏ, బీ, సీ, డీ కేటగిరీలుగా విభజించిన ప్రభుత్వం.. ఈ ఏడాది చివరినాటికి పూర్తయ్యే ప్రాజెక్టులను ఏ కేటగిరీలో చేర్చగా.. వచ్చే ఏడాది చివరి నాటికి పూర్తయ్యే ప్రాజెక్టులను బీ కేటగిరీలోకి చేర్చింది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ప్రస్తుతం నిర్దేశించుకున్న పనులు పూర్తి చేయాలని భావిస్తుండగా.. దీన్ని సీ కేటగిరీలో చేర్చారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా 1, 2, తుమ్మిళ్ల, గట్టు, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం, కోయిల్‌సాగర్‌ను బీ కేటగిరీలో ఉంచారు. మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన సీఎం సమీక్షలో ఈ ప్రకారమే 2025 డిసెంబరు వరకు గడువు విధించారు. పెండింగ్ ప్రాజెక్టులతో పాటు నారాయణపేట-కొడంగల్ పూర్తికి దాదాపు రూ.ఆరు వేల కోట్ల పైచిలుకు నిధులు అవసరమవుతాయి. ఈ నేపథ్యంలో వచ్చే రెండు బడ్జెట్‌లలో వీటికి నిధులను కేటాయించే అవకాశం ఉంది. ఆ ఆలోచనలో భాగంగానే నీటిపారుదల శాఖ అధికారుల నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. ఏ సంవత్సరం ఎంత బడ్జెట్ అవసరమో ప్రతిపాదనలు తీసుకున్నారు. గత ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేశామని చెప్పుకున్నప్పటికీ.. ఇప్పటికీ నిర్దేశిత ఆయకట్టు స్థిరీకరణ జరుగలేదు. రిజర్వాయర్లు కూడా పూర్తిగా నింపుకోలేని పరిస్థితి ఉంది. ఆర్ అండ్ ఆర్, కాలువల నిర్మాణం, డిస్ట్రిబ్యూటరీ, ఫీడర్ ఛానల్ వ్యవస్థ పనులు పెద్ద మొత్తంలో జరగలేదు. ఎత్తిపోతలకు కేటాయించుకున్న నీటిని.. చిన్ననీటిపారుదల చెరువులు, కుంటల్లోకి నింపడం ద్వారా వాటి ఆయకట్టును పునరుద్ధరించారు. పెండింగ్ పనులన్నింటినీ పూర్తిచేసి.. నిర్దేశించిన ఆయకట్టును స్థిరీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే బీ కేటగిరీలో ప్రాజెక్టులను పెట్టి, యుద్ధ ప్రాతిపదికన నిధులు మంజూరు చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. పాలమూరు-రంగారెడ్డికి మాత్రం 2026-2027 బడ్జెట్‌లలో అధిక నిధులు కేటాయించే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

వచ్చే బడ్జెట్ నుంచే..

ఈ నెల చివరిలో ప్రవేశపెట్టనున్న పూర్తిస్థాయి బడ్జెట్‌లో కేటగిరీ ఏ, బీ ప్రాజెక్టులకు భారీగా కేటాయింపులు దక్కే అవకాశం ఉంది. కేటగిరీ ఏ లోని ప్రాజెక్టులకు పూర్తి నిధులు కేటాయించనుండగా.. కేటగిరీ బీ ప్రాజెక్టులకు కొంత తక్కువగా పెట్టి, 2025 బడ్జెట్‌లో మాత్రం ఎక్కువ మొత్తంలో కేటాయింపులు చేసేలా ప్రణాళికలు చేస్తున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకాన్ని రూ.1,428 కోట్ల అంచనా వ్యయంతో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చేందుకు రూపొందించారు. ఆ అంచనాలు పెరుగుతూ పోయాయి. కానీ నేటికీ 1.42 లక్షల ఎకరాలకు మాత్రమే నీరందుతోంది. ప్రస్తుతం ఈ అంచనాలు రూ.2,754 కోట్లకు పెరగ్గా.. అందులో రూ.2,503 కోట్లు ఇప్పటికే ఖర్చు చేశారు. ఇప్పుడు రూ.231.26 కోట్లు అవసరం కానున్నాయి. వచ్చే బడ్జెట్‌లో రూ.67.88 కోట్లు, 2025 బడ్జెట్‌లో రూ.174.16 కోట్లను కేటాయించనున్నారు. ఈ ప్రాజెక్టు కింద ప్రధానంగా 99 బీ, సీ, డీ, 100 ప్యాకేజీల్లో పనులు చేపట్టాల్సి ఉంది. ఆర్డీఎస్ కాలువ నుంచి నీటి రాక తగ్గిపోవడంతో 2017లో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకాన్ని ప్రత్యామ్నాయంగా రూపొందించారు. ఇందులో మూడు రిజర్వాయర్లు నిర్మించాల్సి ఉండగా.. లిఫ్ట్ ఏర్పాటు చేసి వదిలేశారు. తుమ్మిళ్ల అంచనా వ్యయం రూ.1,197.77 కోట్లు కాగా.. ఇప్పటివరకు రూ. 629.26 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ.558.34 కోట్లు ఖర్చు చేసి.. మూడు రిజర్వాయర్లు నిర్మించాల్సి ఉంది. మొత్తం 83,988 ఎకరాలకు నీరిచ్చేందుకు ప్రతిపాదించగా.. ఇందులో ఆర్డీఎస్ ఆయకట్టు 55,600 ఎకరాలు ఉంది. అయితే ఇప్పటికీ ప్రాజెక్టు అసంపూర్తిగానే ఉంది. వచ్చే బడ్జెట్‌లో 11.98 కోట్లు, ఆ తర్వాత మిగిలిన మొత్తం కేటాయింపులు చేసే అవకాశం ఉంది. గత సంవత్సరం ఎన్నికలకు ముందు మల్లమ్మకుంట రిజర్వాయర్‌కు జీవో ఇచ్చినా ఆచరణలోకి మాత్రం రాలేదు.



జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం (ఫైల్)

గట్టు ఎత్తిపోతలకు నిధులపై ఆశలు

గట్టు, ధరూర్, మల్దకల్, కేటీదొడ్డి మండలాల్లోని 33 వేల ఎకరాలకు నీరిచ్చేందుకు చేపట్టిన గట్టు ఎత్తిపోతల పథకానికి నిధుల కేటాయింపుపై ఆశలు నెలకొన్నాయి. ప్రస్తుతం పంప్‌హౌజ్ పనులు నడుస్తున్నాయి. ఈ ప్రాజెక్టుకు రూ.581.06 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇప్పటివరకు రూ.204.96 కోట్లు ఖర్చు చేయగా.. ఇంకా రూ.362.63 కోట్లు అవసరం ఉంది. వచ్చే బడ్జెట్‌లో రూ.77.44 కోట్లు, 2025 బడ్జెట్‌లో రూ.285.19 కోట్లు కేటాయించాలని అధికారులు ప్రతిపాదించారు. జూరాల కాలువల మరమ్మతుల కోసం కూడా నిధులను వచ్చే బడ్జెట్‌లో కేటాయించే అవకాశం ఉంది. ఇక కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద 4.51 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉండగా.. ఇప్పటివరకు 2.73 లక్షల ఎకరాలు మాత్రమే స్థిరీకరించారు. ఇంకా 1.78 లక్షల ఎకరాలను స్థిరీకరించాల్సి ఉంది. దీని కోసం సుమారు రూ.440 కోట్లు అవసరమవుతాయని అంచనా వేస్తున్నారు. 2024, 2025 బడ్జెట్‌లలో సమానంగా కేటాయింపులు దక్కనున్నాయి. కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకం కింద 46 వేల ఎకరాలకు నీరివ్వడానికి రూ.235 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు ఉన్నాయి. భీమా 1, 2 కింద కానాయపల్లి, సంగంబండ తదితర ఆర్అండ్ఆర్, సంగంబండ పగులగొట్టడానికి దాదాపు రూ.415 కోట్లు అవసరం కానున్నాయి.

కొత్త పనులకూ నిధులు..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులతోపాటు కొత్తగా చేపట్టిన, చేపట్టబోయే పనులపైనా రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నెల 13 లేదా 14 తేదీల్లో జరిగే సమీక్షలోపు వివాదాలకు తావులేకుండా కొత్త ప్రతిపాదనలు రూపొందించి.. అనుమతులు తీసుకోవాలని పాలమూరు సమీక్ష సందర్భంగా సీఎం ఆదేశించారు. ఈ క్రమంలో నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకం ప్రధానమైనదిగా చెప్పొచ్చు. లక్షా ముప్పైవేల ఎకరాలకు నీరిచ్చేందుకు ఉద్దేశించిన ఈ లిఫ్ట్‌కు రూ.2,945 కోట్లు కేటాయించారు. రెండేళ్ల లక్ష్యం పెట్టుకోగా.. సర్వే, డీపీఆర్ సిద్ధం చేశారు. టెండర్లు పిలిచిన తర్వాత పనులు చేపట్టే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రెండు బడ్జెట్‌లలో ఇందుకు తగిన నిధులు కేటాయించనున్నారు. అలాగే కోయిల్‌సాగర్ ద్వారా దేవరకద్ర నియోజకవర్గంలో నీరందించేందుకు హజిలాపూర్, చౌదర్పల్లి, నాగిరెడ్డిపల్లి లిఫ్ట్‌ల ఏర్పాటును పరిశీలించే అవకాశం ఉంది. కోయిల్‌సాగర్ పనుల పూర్తి సమయంలోనే వీటి ఏర్పాటు సాధ్యమైతే నిధులు కేటాయించనున్నారు. ఇక జవహర్ నెట్టంపాడు ఎత్తిపోతల పథకాన్ని రీ ఎగ్జామిన్ చేయాలని ఆదేశించారు. ప్రధానంగా ర్యాలంపాడు రిజర్వాయర్ బండ్‌ను బలోపేతం చేయాలి. జీయో మైంబ్రీన్ షీట్స్ వేసి.. బండ్ తిరిగి నిర్మించాలి. తద్వారా లీకేజీలను అరికట్టవచ్చు. అయితే ర్యాలంపాడు సామర్థ్యాన్ని 10 టీఎంసీల మేర పెంచుకుంటే.. దీని ఆధారంగా ఉన్న గట్టు లిఫ్టుకు నాలుగు టీఎంసీల నీటిని అందించవచ్చని అక్కడి ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో రీ ఎగ్జామిన్ చేయాలని సీఎం ఆదేశించారు. కొత్త ప్రతిపాదనలు సిద్ధమైతే వాటికీ నిధులు వచ్చే అవకాశం ఉంది.



పీఆర్ఎల్ఐలో భాగంగా నిర్మించిన ఏదుల పంప్‌హౌస్

మళ్లీ ఇసుక దందా

- జోగుళాంబ గద్వాల జిల్లాలో ఎస్పీ మారిన వెంటనే అక్రమంగా రవాణా
- రాత్రిళ్లు డంప్ చేసి సరఫరా
- ఫిల్టర్ ఇసుకకు కేరాఫ్‌గా మారిన గద్వాల మండలం
- నీకెంత... నాకెంత అనే ధోరణిలో పోలీస్ అధికారులు?
- వారి పేర ట్రాక్టర్‌కు రూ.2 వేలు, టిప్పర్‌కు రూ.10 వేల చొప్పున వసూలు



సంగాల గ్రామంలోని ఓ వ్యక్తి పొలంలో ఉన్న ఫిల్టర్ ఇసుక డంపు

గద్వాల క్రైం, జూలై 10: జోగుళాంబ గద్వాల జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను గత కొంతకాలంగా బంద్ చేసిన ఇసుకాసురులు.. గత ఎస్పీ రితిరాజ్ బదిలీపై వెళ్లిన వెంటనే మళ్లీ ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇసుక అక్రమ రవాణాతో పాటు.. గద్వాల మండలంలో ఫిల్టర్ ఇసుకను తయారు చేసి యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. అధికార పార్టీ మాజీ ప్రజాప్రతినిధులతో పోలీసులు కుమ్మక్కవడం వల్లే ఈ విషయం తెలిసినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఇసుకను రాత్రిళ్లు డంప్ చేసి, అక్కడి నుంచి తరలిస్తున్నారు. సుమారు 30 టిప్పర్లు, 150 వరకు ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతున్నట్లు తెలుస్తోంది. రాజోలిలో గల పెద్దమ్మ గుడి సమీపంలో, నది తీర ప్రాంతంలోని చింతచెట్ల సమీపంలో రాత్రిళ్లు ఇసుకను డంప్ చేసి, మరుసటి రోజు రాత్రి ట్రాక్టర్లు, మినీ టిప్పర్లతో రామాపురం, అయిజ, వెంకటాపురం, షాబాద, ఇటిక్యాలకు తరలిస్తున్నారు. ఇందులో రాజోలికి చెందిన మాజీ ప్రజాపతినిధి ప్రధాన సూత్రధారిగా ఉన్నట్లు సమాచారం. వీరికి పోలీసుల అండదండలు పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా కేంద్రంలోని సంగాలలో కూడా పొలాలతో పాటు మరికొన్ని చోట్ల ఇసుకను డంప్ చేసి రాత్రిళ్లు తరలిస్తున్నారు. ఇందులో సంగాలకు చెందిన అధికార పార్టీ వ్యక్తి కీలకపాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. ఈయనతో పాటు మరో ముగ్గురు కూడా ఉన్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఇందులో కొందరు ఇసుకను రవాణా చేస్తే.. మరొక వ్యక్తి ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు. అలాగే అలంపూర్‌లోని సుల్తానాపురం, ర్యాలంపాడు మధ్యన ఉన్న గట్టు వద్ద ఇసుక డంపు చేసి, మరుసటి రోజు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు సమాచారం. ఇక్కడ ఓ మాజీ ప్రజాప్రతినిధి పోలీసుల అండదండలతో ఇసుకను యథేచ్ఛగా సరఫరా చేస్తున్నారని తెలుస్తోంది. ఇసుకను సరఫరా చేస్తున్నందుకు పోలీసుల పేర ట్రాక్టర్‌కు అయితే రూ.రెండు వేలు, టిప్పర్ అయితే రూ.10 వేలు కొందరు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ డబ్బులు ఎవరు తీసుకుంటున్నారో తెలియాల్సి ఉంది. ఇటిక్యాల మండలం ఎర్రవల్లికి చెందిన ఓ వ్యక్తి, గద్వాల మండల పరిధిలోని చెనుగోనిపల్లికి చెందిన అధికార పార్టీ బంధువు ఒకరు ఈ దందాలో కీలకపాత్ర పోషిస్తున్నారని సమాచారం.

ఫిల్టర్ ఇసుకకు అడ్డాగా గద్వాల

గద్వాల మండలం సంగాల గ్రామానికి చెందిన అధికార పార్టీ వ్యక్తి ఒకరు గోనుపాడు గ్రామంలో ఫిల్టర్ ఇసుకను తయారు చేసి, రూ.లక్షలు గడిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఇసుకను ట్రాక్టర్‌పై తరలించే క్రమంలో తాజాగా వాహనం బోల్తాపడి ఒక కూలీపై మృతి చెందినట్లు ఆరోపణలు వచ్చాయి. అయితే రాళ్ల లోడ్ తరలించే క్రమంలో మృతి చెందినట్లు బాధిత బంధువులు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై రూ.మూడు లక్షలు చేతులు మారినట్లు చర్చ జరిగింది. ఈ రూ.మూడు లక్షలు ఎవరికి ముట్టాయో తెలియాల్సి ఉంది.

చోద్యం చూస్తున్న పోలీసులు

అధికార పార్టీకి చెందిన కొందరు మాజీ ప్రజాప్రతినిధులు ఇసుక అక్రమ రవాణాలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. ఇంకొందరు ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పుకుంటూ, అధికారులకు మామూళ్లు ఇస్తూ దందా సాగిస్తున్నారని సమాచారం. ఇసుక దందాలో అధికారులు.. మీకెంతో మాకంత అనే ధోరణిలో అక్రమార్కులతో చేతులు కలిపినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

అనుమతులు తీసుకోకుంటే కేసులు



ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకొనే ఇసుకను సరఫరా చేయాలి. అనుమతులు లేకుండా తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు. ఇసుకను అక్రమంగా తరలించే విషయంలో ఇప్పటికే 88 కేసులు నమోదు చేశాం. అందులో 164 మంది ఉండగా, 204 ట్రాక్టర్లు, ఒక డీసీఎం, ఆరు టిప్పర్లను అదుపులోకి తీసుకున్నాం. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే ప్రజలు మాకు సమాచారం ఇవ్వాలి. అటువంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాసరావు, ఎస్పీ



నడింపల్లిలో ఎండుతున్న జొన్న పంట



రాయిచేడులో పత్తి చేనుకు స్ప్రింక్లర్ల ద్వారా అందిస్తున్న నీరు

కరువు ఛాయలు

- నాగర్‌కర్నూల్ జిల్లాలో 2.81 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు
- సాగుకు నోచుకోని 3,57,802 ఎకరాల భూములు
- వర్షాలు లేక ఎండుతున్న అరకొర పైర్లు

జిల్లాలో పంటల సాగు వివరాలు(ఎకరాల్లో..)

పంట	సాగు అంచనా	ప్రస్తుత సాగు
పత్తి	2,73,720	1,52,598
వరి	40,82	102
కందులు	3,755	2,043
మొక్కజొన్న	45,237	12,691
జొన్న	3,442	4,059

అచ్చంపేట, జూలై 10: నాగర్‌కర్నూల్ జిల్లాలో కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. ఈ ఏడాది సాగు అంచనా 5,31,109 ఎకరాలకు గాను ఇప్పటి వరకు 1,73,307 ఎకరాల్లోనే పంటలు సాగయ్యాయి. పైగా వానల్లేక వేసిన పంటలు ఎండిపోతున్నాయి. వాటిని కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. వర్షాలు కురవాలని పలువురు రైతులు పూజలు చేస్తున్నారు. భూగర్భ జలాలు కూడా గతేడాదికంటే 2.81 మీటర్ల లోతుకు పడిపోయాయి. జిల్లాలోని 20 మండలాలకు 18 మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి మండలాల్లో మాత్రమే 1.8 మీటర్ల పైకి జలాలు వచ్చాయి. జూలై వచ్చినా ఇప్పటి వరకు 3,57,802 ఎకరాల భూమి సాగుకు నోచుకోలేదంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. జిల్లాలో జొన్నలు మినహా మిగతా ప్రధాన పంటలైన పత్తి, వరి, మొక్కజొన్న, కందులు వంటి సాగు అంతంత మాత్రంగానే ఉంది. వర్షాలు కురవకపోతే కరువు ఖాయమేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గాల వారీగా భూగర్భ జలాల వివరాలు(మీటర్లలో..)

నియోజకవర్గం	2023 జూన్	2024 జూన్	తగ్గుదల
అచ్చంపేట	6.39	10.06	3.67
కొల్లాపూర్	3.61	2.07	1.55(పెరిగింది)
కల్వకుర్తి	8.57	13.76	5.9
నాగర్‌కర్నూల్	13.44	17.97	4.53

బతికేది కష్టమే



నేను ఏడు ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి వేసన. మొల్కలు బాగనే మెల్చినవి. కానీ వాన దేవుడు దయ చూస్తలేడు. ఈ ఏడాది పంటలు పండకపోతే బతికేది కష్టమే. భూమి గుత్త కూడా ఎల్లదో లేదో .

- మందుల చిన్న బాలయ్య, కౌలు రైతు, బల్మూరు

తెగుళ్లు వస్తున్నవి



నేను 10 ఎకరాల్లో మొక్కజొన్న వేసిన. సాల్లాలం వానలతో చేల్లు సావకుండ.. బత్కకుండ ఉన్నవి. ఇట్లే ఉంటే చేలకు తెగుళ్లు వస్తున్నవి. ఈసారి పెట్టుబడులు మొత్తం మీద పడుతవి.

- సబావత్ శ్రీను, రైతు, లింగాల



భూగర్భ జలాలు అడుగంటడంతో అచ్చంపేట మండలం ఎద్దుమిట్ట తండాలో నీటిని ధారగా పోస్తున్న బోరు



నీరు లేక వాడిపోతున్న జొన్న మొక్క

మక్తల్‌కు మున్సిఫ్ కోర్టు మంజూరు



జీవో కాపీ అందుకుంటున్న ఎమ్మెల్యే శ్రీహరి

మక్తల్, జూలై 10 : మక్తల్ పట్టణానికి మున్సిఫ్ కోర్టు మంజూరైనట్లు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తెలిపారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారి మున్సిఫ్ కోర్టు ఏర్పాటుకు సంబంధించిన జీవో కాపీ అందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. పట్టణంలో కోర్టు ఏర్పాటు కానున్న నేపథ్యంలో ఫస్ట్‌క్లాస్ సివిల్ న్యాయాధికారి పోస్టును సైతం మంజూరు చేస్తూ జీవో విడుదల చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఎమ్మెల్యే చిత్ర పటానికి క్షీరాభిషేకం..

మక్తల్ పట్టణానికి మున్సిఫ్ కోర్టు మంజూరు కావడంతో బుధవారం పట్టణానికి చెందిన లాయర్లు అంబేడ్కర్ చౌరస్తాలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం బాణాసంచా కాల్చి సంబురాలు నిర్వహించారు. దశాబ్దాల కల నెరవేరడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో లాయర్లు దత్తాత్రేయ, సూర్యప్రకాష్, సురేందర్, రామ్మోహన్, నరేందర్‌సాగర్, ఆనంద్, రవికుమార్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, మహేష్ పాల్గొన్నారు.

చెంచు మహిళను పరామర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్

- ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ చేసిన చైర్మన్



బాధిత మహిళ ఇంటి నిర్మాణం కోసం భూమి పూజ చేస్తున్న తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

కొల్లాపూర్, జూలై 10: సమాజం సిగ్గుతో తలదించుకునేలా చెంచు మహిళపై దాష్టీకానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామం భ్రమరాంబ కాలనీలో చైర్మన్ బక్కి వెంకటయ్య బృందం బుధవారం పర్యటించింది. బాధిత మహిళ ఇంటికెళ్లి దాడి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా చెంచులపై ఇంకా ఆటవిక చర్యలకు పాల్పడుతున్నారని, అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. బాధిత మహిళను ఇంకా బెదిరింపులకు గురి చేస్తున్న వారిని అదుపులోకి తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. మహిళకు ప్రభుత్వం ప్రకటించిన గృహ నిర్మాణం కోసం ఆయన భూమి పూజ చేశారు. కమిషన్ ఆమెకు అండగా ఉంటుందని, చెంచుల సమస్యలు పరిష్కారం అయ్యేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో నాగరాజు, తహసీల్దార్ శ్రీకాంత్, సీఐ మహేష్, రెవెన్యూ ఉద్యోగులు ఎస్సీ, ఎస్టీ కమిషన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

10 ఎకరాల భూమి ఇవ్వాలి

బాధిత మహిళ కుటుంబానికి ప్రభుత్వం 10 ఎకరాల భూమి ఇవ్వాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.అశోక్ ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. వారి పిల్లల చదువు, ఖర్చులు ప్రభుత్వమే భరించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, 50 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న చెంచు, గిరిజనుల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, గృహాలు మంజూరు చేసి జీవనోపాధి కల్పించాలని కోరారు. ఘటనపై హైకోర్టు జడ్జితో జ్యుడీషియల్ విచారణ జరిపించాలని, రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని, దాడికి పాల్పడిని వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీపీఎం మండల కమిటీ సభ్యులు సలీం, ఎన్.కిరణ్‌కుమార్, బత్తిని రాజు చైర్మన్‌కు వినతి ప్రతం అందజేశారు.

టీచర్‌గా మారిన పేట కలెక్టర్

- జాజాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన
- బోర్డుపై తొమ్మిదో తరగతి విద్యార్థులకు టీచింగ్

నారాయణపేట, జూలై 10 : నారాయణపేట జిల్లా కేంద్ర మండలం జాజాపూర్ ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ టీచర్‌గామారి తొమ్మిదో తరగతి విద్యార్థులకు గణితం బోధించారు. తరగతి గదిలో బోర్డుపై లెక్కలు చెబుతూ డైయాగ్రామ్ గీసి విద్యార్థులకు సమగ్రంగా అర్థమయ్యేరీతిలో బోధించి ఆకట్టుకున్నారు. అనంతరం విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. పదో తరగతిలో ఫలితాలపై అరాతీయగా 84 శాతం ఉత్తీర్ణులు అయ్యారని ప్రధానోపాధ్యాయురాలు భారతి కలెక్టర్‌కు తెలిపారు. ఈ సారి కష్టపడి చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అంతకుముందు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన కలెక్టర్ వండిన అన్నం రుచి చూశారు.


విద్యాబోధన చేస్తున్న నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

బైకు, బొలెరో ఢీకొని వ్యక్తి మృతి

జడ్చర్ల, జూలై 10 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీలోని బురెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారిపై బుధవారం బొలెరో వాహనం, బైకు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో నాగర్‌కర్నూల్ జిల్లా నేరెళ్లపల్లి గ్రామానికి చెందిన శ్రీను (40) తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు... నేరెళ్లపల్లి నుంచి జడ్చర్లకు పని మీద శ్రీను బైకుపై వచ్చాడని, జాతీయరహదారిపై బురెడ్డిపల్లికి మళ్లేందుకు రోడ్డు దాటుతుండగా, జడ్చర్ల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న బొలెరో ఢీ కొట్టింది. బైకుపై నుంచి రోడ్డుపై పడిన శ్రీనుపై బొలెరో వాహనం టైర్లు ఎక్కడంతో కడపు భా గం ఛిద్రమై పేగులు బయటకు వచ్చాయి. చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ ఆ సుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, ఈ సంఘటనకు నిరసనగా జాతీయ రహదారిపై బురెడ్డిపల్లి వాసులు ఆందోళన చేపట్టారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని ఆందోళన చేపట్టిన వారిని సముదాయించి, అక్కడి నుంచి పంపించివేశారు.

రేపు వనపర్తి జిల్లాకు మంత్రుల రాక

- రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

వనపర్తి అర్బన్‌జూలై10: రేపు వనపర్తి జిల్లాకు డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు రానున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒకటైన రైతు భరోసా అభిప్రాయ సేకరణ విషయంలో విధివిధానాలపై రైతులు, అధికారులతో చర్చించనున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరాకు ప్రతీ సంవత్సరం రూ.10వేల చొప్పున ఇవ్వగా, అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఎకరానికి రూ. 15వేలు ఇస్తామని ప్రకటించింది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం గుట్టలకు, వెంచర్లకు అర్హులు కాని వారికి కూడా ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన రైతులకే ఇవ్వాలని నిర్ణయించింది. అందులో భాగంగానే ఇప్పటికే పథకంలో మార్పులు చేసి సింగిల్ విండో ఆధ్వర్యంలో రైతుల అభిప్రాయాల సేకరణ కూడా సేకరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించే రైతు భరోసా అభిప్రాయ సేకరణకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు రాష్ట్ర కేబినెట్ సబ్ కమిటీ సభ్యులు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉమ్మడి పాలమూరు జిల్లా ఇంచార్జీ మంత్రి దామోదర రాజనర్సింహ , ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , ఎంపీ మల్లు రవి , ఎమ్మెల్సీలు ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు, ఐదు జిల్లాల కలెక్టర్లు , వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. వీరంతా ఈ సమావేశంలో రైతు ప్రతినిధులు సంఘాల నాయకుల అభిప్రాయాలు సేకరించనున్నారు.

విద్యుదాఘాతంతో డ్రైవర్ మృతి

నవాబ్‌పేట, జూలై 10: రహదారిపై వెళ్తున్న డీసీఎంకు విద్యుత్ వైర్లు తగిలి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మహ బూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని ఇప్ప టూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. ఏపీలోని రాజమండ్రి పట్టణం ఏలేశ్వరంకు చెందిన గొల్ల నూకార్జున (40) తన డీసీఎం వాహనంలో మామిడి చెట్లు తీసుకవస్తుండగా ఇప్పటూర్ గ్రామ సమీపంలో విద్యుత్ వైర్లు వాహనానికి తగలడంతో మంటలు వచ్చాయి. గమనించిన డ్రైవర్ నూకార్జున ఒక కాలుకు చెప్పు లేకపోవడంతో అర్త్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ విక్రం ఘటన స్థలానికి చేరుకుని కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కోనేరును పూడ్చిన వ్యక్తి రిమాండ్

జడ్చర్ల, జూలై 10 : మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి పాతబజారు స మీపంలోని రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీరంగనాయకస్వామి దేవాలయం ముందున్న కోనేరును పూడ్చి వేసిన రవితేజగౌడ్‌ను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన అనిల్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, రవితేజగౌడ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

కుక్కల దాడిలో రెండు లేగ దూడల మృతి

హన్వాడ, జూలై 10: మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని ఇబ్రహీంబాద్ గ్రామంలో కుక్కల దాడిలో రెండు లేగదూడలు మృతి చెందాయి. బుధవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన కొత్తూరు సుదర్శన్ రెడ్డి తన షెడ్‌లో దూడలను కట్టేసి ఇంటికి వెళ్లి వచ్చే లోగా కుక్కలు దూడలపై దాడి చంపేశాయి. పశువులపై రోజురోజుకు కక్కుల దాడులు అధికమవుతున్నాయని పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు.

సంగమేశ్వరం ఆలయం చేరువలో వరద జలాలు



సంగమేశ్వరం వద్ద భవనాసినికి చేరిన వరద నీరు

కొల్లాపూర్, జూలై 10: తెలుగు రాష్ట్ర ప్రజలు ఆరాధ్య దైవంగా పూజించే సప్తనదుల సంగమ క్షేత్రమైన సంగమేశ్వర ఆలయం సమీపంలోని వరద జలాలు చేరాయి. బుధవారం నాటికి సంగమేశ్వరం ఆలయం సమీపంలో ఉన్న భవనాసినికి వరద ఉధృతి చేరింది. మరో వారం రోజులులోపు సంగ మేశ్వర ఆలయం చుట్టూ కృష్ణానది జలాలు చుట్టుముట్టనున్నాయి. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు ఇప్పటికే ఆల్మట్టి డ్యాంకు చేరుకున్న వరద జలాలు జూరాల ద్వారా కృష్ణానదిలోని ప్రవహిస్తే మరో పదిహేను రోజుల లోపు సంగమేశ్వర ఆలయం ప్రాంగణంలోకి వరద జలాలు చేరుతాయని మత్స్యకారులు, ఆలయ పురోహితులు పేర్కొన్నారు. చివరిసారిగా సంగమేశ్వర ఆలయాన్ని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్ర ప్రజలు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. వరద నీటిలో ఆరునెలల పాటు జల దివాసమయ్యే సంగమేశ్వర ఆలయంలో చివరి పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు.

రైస్ మిల్లులో తనిఖీలు



సాయి గోపాల్ ఇండో ప్లాంట్‌లో తనిఖీలో పాల్గొన్న అధికారులు

పెబ్బేరురూరల్, జూలై 10: ఉమ్మడి పెబ్బేరు మండలంలోనిసాయి గోపాల్ ఇండోకెట్ రైస్ మిల్లును బుధవారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ టీంకు చెందిన హెడ్ ద్రోణచార్యులు నాగర్‌కర్నూల్ జిల్లా డీఎం బాలరాజు, టెక్నికల్ అధికారి దేవయ్యలు తనిఖీ చేశారు. ప్లాంట్‌లో ఆరు లక్షల 83 వేల బస్తాలు నిల్వ ఉండాల్సి ఉండగా ఆరు లక్షల వెయ్యి బస్తాలు నిల్వ ఉన్నట్లు అధికారులు తేల్చారు. తనిఖీల్లో పెబ్బేరు తహసీల్దార్ లక్ష్మి, ఎస్ఐ హరిప్రసాదొరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వేణునాయుడు పాల్గొన్నారు. రైస్ మిల్లుల్లో కోట్ల రూపాయల విలువ గల ధాన్యాన్ని బ్లాక్ మార్కెట్‌లో తరలించి సొమ్ము చేసుకుంటూ ప్రభుత్వానికి బకాయి పడ్డ మిల్లర్లను వదిలి పెట్టి సక్రమంగా నడుపుతున్న మిల్లుల్లో రాష్ట్ర విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఉమ్మడి మండలంలో దాదాపు 30 రైస్ మిల్లులు ఉండగా కొన్నింటిపై మాత్రమే దాడులు చేస్తుండటంతో పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భారీ అక్రమాలకు పాల్పడిన వారి మిల్లుల వైపు కన్నెతి చూడ టం లేదని పలువురు విమర్శిస్తున్నారు. గుట్టను తవ్వి ఎలుకను పట్టినట్టుగా మొక్కుబడిగా రైస్ మిల్లుల తనిఖీలు జరుగుతున్నాయని అభిప్రాయపడు తున్నారు.

ఈత, తాటి చెట్ల ధ్వంసంపై విచారణ



ఈత చెట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ, అధికారులు

పెబ్బేరురూరల్, జూలై 10: వనపర్తి జిల్లా పెబ్బేరు మండలపరిధిలోని రంగాపురం గ్రామంలో జాలు కాలువపై దాదాపు 300 ఈత, తాటి చెట్లను ధ్వంసం చేసిన ఘటపై అధికారులు విచారణ చేపట్టారు. బుధవారం ఎక్సైజ్ ఎస్ఐ గోవర్ధన్ రంగాపురం గ్రామంలో సంఘటన స్థలానికి చేరుకొని ధ్వంసమైన చెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం మండల అధ్యక్షుడు కాటమోని రాజశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో ఈత చెట్లను ధ్వంసం చేస్తూ గౌడ వృత్తికి దెబ్బ తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా పెబ్బేరు మండలంలో పలు గ్రామాల్లో ఈత చెట్లను ధ్వంసం చేస్తున్నారని ఆయన అన్నారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రంగాపురం గ్రామానికి గౌడ నాయకులు రాజుగౌడ్, వేణుగౌడ్, వెంకటస్వామిగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ చంద్రయ్య, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలస్యంగా వచ్చిన ఉపాధ్యాయులకు ఆఫ్‌లీవ్ వేయాలి


- ఏఎంవో దుంకుడు శ్రీనివాస్



విద్యార్థులతో ప్రార్థన చేయిస్తున్న ఏఎంవో

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూలై 10 : పాఠశాల ప్రార్థన సమయానికి ఆలస్యంగా వచ్చిన ఉపాధ్యాయులకు సగం పూట సెలవు వేయాలని ఏఎంవో దుంకుడు శ్రీనివాస్ సూచించారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ లైన్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను ఏఎంవో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులతో ప్రార్థన చేయించారు. ప్రార్థనకు ఆలస్యంగా వచ్చిన ఉపాధ్యాయులకు సగం పూట సెలవు వేయాలని ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు. ఉర్దూ మీడియం విద్యార్థుల హాజరుశాతం తక్కువగా ఉందని హాజరుశాతాన్ని పెంచాలన్నారు. విద్యార్థులకు తప్పని సరిగా జయజయహే తెలంగాణ గేయాన్ని నేర్పించాలన్నారు. విద్యార్థులలో సామర్థ్యాలు పెంపొందించేందుకు కృషి చేయాలని ఆయన తెలిపారు. విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మాట్లాడారు.ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా పోషమ్మ బోనాలు



అమ్మవారి గుడి దగ్గర బోనాలు సమర్పిస్తున్న గ్రామస్థులు

నవాబ్‌పేట, జూలై 10: మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలంలోని మరికల్ గ్రామంలో గ్రామ దేవత పోషమ్మకు గ్రామస్తులు బుధవారం బోనాల పండుగ జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ దేవతకు ప్రత్యేకంగా బోనం కుండలో తయారు చేసిన నైవేద్యం తీసుకువచ్చి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా తమ గ్రామాన్ని పిల్లా పాపలను పంటలను సల్లంగా సూడాలని మొక్కుకున్నారు. గ్రామంలో బోనాల పండుగ సందర్భంగా పండుగ వాతావరణం నెలకొంది. బంధువుల రాకతో సందడి నెలకొంది. కార్యక్రమంలో గడ్డం రవి, మాజీ సర్పంచ్ పాండురంగయ్య, నర్సిరెడ్డి, రాంమోహన్ శర్మ, మాజీ ఎంపిటీసీ రాములమ్మ, సత్యకుమార్, మాజీ వార్డు సభ్యులు గడ్డం శేఖర్, మల్లేష్, పురుషోత్తం యువకులు తదితరులు పాల్గొన్నారు.

కల్లుతో 'పరేషాన్'

- జనరల్ ఆసుపత్రికి వచ్చే రోగుల్లో 90 శాతం మంది కల్లు బాధితులే

- కల్లు లేకపోవడంతో ఆల్కహాలిక్ విత్‌డ్రాయల్ సిండ్రోమ్‌కు గురవుతున్న రోగులు

- చికిత్సకు సహకరించకపోవడంతో మంచానికి కట్టేసి వైద్యం

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూలై 10: గ్రామీణ ప్రాంతాల్లో కల్లు బాధితులు విపరీతంగా పెరిగిపోయారు. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా కల్లు తాగుతూ బానిసలుగా మారుతున్నారు. కొందరు ఏదో ఒక రోగంతో ఆసుపత్రికి వచ్చి అడ్మిట్ అవుతుండగా, మరికొందరు అడ్మిట్ అయ్యి ఆపరేషన్ కూడా చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో ఒకటి, రెండు రోజులు ఆసుపత్రిలో ఉండాల్సి రావడంతో అప్పుడు అసలు అపరిచితులు మేల్కొంటాడు. కల్లులేక కొందరు పిచ్చిపిచ్చిగా తనలో తానే మాట్లాడుకుంటుండగా, మరికొందరు ఫిట్స్ బారిన పడుతున్నారు. ఎక్కువగా ఆపరేషన్ చేసిన తర్వాత కల్లు లేక ఆల్కహాలిక్ విత్‌డ్రాయల్ సిండ్రోమ్‌కు గురవుతున్నారు. ఆసుపత్రికి వచ్చే వారిలో 90 శాతం మంది కల్లు బాధితులే ఉండడం విశేషం.



ఆసుపత్రి ఆవరణలో కల్లు తాగుతున్న మహిళ

మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రికి వచ్చే వారిలో ఎక్కువగా ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, విభాగాలలోనే ఆపరేషన్లు అవుతుంటాయి. ఇందులో 30నుంచి 60 సంవత్సరాలలోపు వారికి కల్లు అలవాటు ఉంటుంది. అలాంటి వారికి ఆపరేషన్ చేసిన తర్వాత పోస్ట్ ఆపరేటిక్ వార్డుకు తీసుకెళ్తారు. అక్కడి నుంచి వార్డుకు షిఫ్ట్ చేస్తారు. ఆ ప్రక్రియ మొత్తం రెండు రోజులు అవుతుంది. ఆ రెండు రోజుల వ్యవధిలో కల్లు లేక పిచ్చిపిచ్చిగా చేస్తున్నారు. తనలో తానే మాట్లాడుకోవడం, ఎవరో వచ్చి కొడుతున్నట్లు, చంపుతున్నట్లు భయపడుతూ ఉండడం, వస్తువులు విసిరిపారేయడం చేస్తున్నారు. మరికొంతమందికి ఫిట్స్ కూడా వస్తున్నాయి. దీంతో అలాంటి వారిని ఐసీయూకి షిఫ్ట్ చేసి చికిత్స అందిస్తున్నారు. డాక్టర్లు ఎంతో కష్టపడి ఆపరేషన్ చేసిన తర్వాత రోగులు ఆల్కహాలిక్ విత్‌డ్రాయల్ సిండ్రోమ్‌కు గురికావడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. జనరల్ వార్డుల్లోనూ అదే పరిస్థితి ఉంటోంది. కనీసం ఒక్క గ్లాసైనా తాగితే తప్పా నిద్ర రాదని బాధితులు వాపోతున్నారు. కల్లు లేక ఆల్కహాలిక్ విత్‌డ్రాయల్ సిండ్రోమ్‌కు మారిపోతున్న రోగులను వార్డుల్లో మంచానికి కట్టేసి చికిత్స అందిస్తున్నారు. కొందరు ఆపరేషన్ చేసి వేసిన కుట్లను తెంచుకోవడం, ప్లాస్టర్‌ను తొలగించడం, సెలైన్ బాటిళ్లను, ఐవీ సెట్‌లను తొలగించడం చేస్తున్నారు. దీంతో వారిని మంచానికి కట్టేస్తే తప్పా చికిత్స అందించడానికి కుదరదని నర్సింగ్ సిబ్బంది చెబుతున్నారు.



మంచాలకు కట్టేసి చికిత్స అందిస్తున్న దృశ్యం

వార్డుల్లో కల్లు సీసాలు...

ఆసుపత్రిలో భద్రత సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కల్లు సీసాలు వార్డుల్లోకే తెచ్చుకుంటున్నారు. సాయంత్రం కాగానే దొడ్డలోనిపల్లి, తిమ్మసానిపల్లి, ఏనుగొండ గ్రామాల నుంచి కల్లు తెచ్చుకుంటున్నారు. కొందరైతే కమీషన్ ఇచ్చి మరీ తెప్పించుకుంటున్నారు. రోగులు, వారి వెంట ఉండే అటెండర్లు సైతం కల్లు తాగకుండా ఒక్కరోజు కూడా ఉండలేక సతమతమవుతున్నారు. ఆసుపత్రి అధికారులు స్పందించి ఆసుపత్రి లోపలికి వచ్చే వారి బస్తాలను తనిఖీ చేసి పంపిస్తే కల్లు సీసాలు లోపలికి రాకుండా ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఆపరేషన్‌కు ఇబ్బందిగా మారుతుంది

ఆసుపత్రికి వచ్చే వారిలో కల్లు బాధితులే ఎక్కువగా ఉంటున్నారు. తాము ఎంతో కష్టపడి క్లిష్టతరమైన ఆపరేషన్లు చేస్తున్నప్పటికి కల్లు తాగి ఇన్‌ఫెక్షన్లు తెచ్చుకుంటున్నారు. ఆపరేషన్ చేసిన గాయం చీము పట్టడం, పుండు మానకపోవడం జరుగుతున్నాయి. కల్లు తాగిన వారు మందులు కూడా సరిగ్గా వేసుకోవడం లేదని తమ దృష్టికి వచ్చింది. ఇతర ఆల్కహాల్‌లు తాగడం వలన కాకుండా కల్లు తాగిన వారిలోనే ఆల్కహాలిక్ విత్‌డ్రాయల్ సిండ్రోమ్ వస్తుంది. వారిని కల్లు మాన్పించేందుకు సైకియాట్రి డాక్టర్‌తో కౌన్సెలింగ్, మందులు కూడా ఇప్పిస్తున్నాం. అదేవిధంగా వార్డులకు, ఆసుపత్రి ఆవరణలోకి కల్లు రాకుండా చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ జీవన్, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్

క్రీడలతో మానసికోల్లాసం

- ట్రాన్స్‌కో ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ జగత్‌రెడ్డి

-హోరాహోరీగా బ్యాడ్మింటన్ పోటీలు

మహబూబ్‌నగర్‌స్పోర్ట్స్, జూలై 10 : క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందని టీజీ ట్రాన్స్ కో, ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ టి.జగత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఇండోర్‌స్టేడియంలో బుధవారం తెలంగాణ ట్రాన్స్‌కో, టీజీ డిస్కమ్ ఇంటర్ సర్కిల్ మెన్స్ బ్యాడ్మింటన్ టోర్నీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా టీజీ ట్రాన్స్ కో, ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ టి.జగత్‌రెడ్డి, చీఫ్ ఇంజనీర్ లతవినోద్ హాజరై టోర్నీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధుల్లో నిత్యం బిజీగా ఉండే ఉద్యోగులకు క్రీడలు ఉల్లాసాన్ని ప్రశాంతతను ఇస్తాయ న్నారు. ఆటలు ఆడడం వల్ల ఉద్యోగుల్లో ఐక్యత, మానసికంగా శారీకంగా దృడంగా ఉండి సంస్థ అభివృద్ధికి మరింత చురకుగా పని చేస్తాన్నారు. రెండు రోజుల పాటు జరిగే పోటీల్లో బ్యాడ్మింటన్ క్రీడాకారులు తమ ప్రతిభ చాటి విజయం సాధించాలని ఆకాక్షించారు. డీవైఎస్‌వో శ్రీనివాస్ మాట్లాడుతూ రా ష్ట్రస్థాయి బ్యాడ్మిం టన్ పోటీలు నిర్వహించడం పట్ల విద్యుత్ శాఖ ఉద్యోగులను అభినందించారు. బ్యాడ్మింటన్ టోర్నీ తమ ప్రతిభ చాటాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ట్రాన్స్‌కో ఓఎంసీ వాసు దేవరావు, ఎస్ఈ ఆపరేషన్ రమేష్, స్పోర్ట్స్ ఆఫీసర్ జగ్గనాథం, ఓంఎసీ సర్కిల్ జనరల్ సెక్రటరీ రజనీ కాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ జగత్‌రెడ్డి



బ్యాడ్మింటన్‌లో తలబడుతున్న జట్ల క్రీడాకారులు

- నేడు ఫైనల్స్

టోర్నీలోని మ్యాచ్‌లు హోరాహోరీగా కొనసాగాయి. 25 సర్కిల్స్ నుంచి 130 మంది క్రీడాకారులు టోర్నీలో పాల్గొన్నారు. మొదటి రోజు నాకౌట్, క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లు నిర్వహించారు. పలువురు క్రీడాకారులు సత్తా చాటి సింగిల్స్, డబుల్స్, టీమ్‌ఇవెంట్‌లో క్వార్టర్, సెమీ ఫైనల్స్‌కు చేరాయి. టీమ్ ఇవెంట్‌లో విభాగంలో వరంగల్ సర్కిల్ జట్టు నిజామాబాద్ ఆపరేషన్ జట్టుపై, విద్యుత్ సౌధ జట్టు, నల్గొండ ఆపరేషన్ జట్టుపై విజయం సాధించి సెమిఫైనల్‌కు చేరాయి. మహబూబ్ నగర్ ట్రాన్స్‌కో ఓంఎంసీ జట్టు, ఖమ్మం ఓంఎసీపై, బంజరాహిల్స్ జట్టు మెదక్‌పై గెలిచి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరాయి. గురువారం ఫైనల్స్ మ్యాచ్‌లు ఆడనున్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం



మరికల్‌లో పట్టుబడిన పీడీఎస్ బియ్యం

మరికల్, జూలై 10: నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో పోలీసులు పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఎస్ఐ మురళి తెలిపిన వివరాల ప్రకారం.. మరికల్‌లోని దళితవాడలో ఎరుకలి మొగులయ్య ఓ ఇంట్లో పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు పక్కా సమాచారం వచ్చింది. దాంతో పోలీసులు దాడులు నిర్వహించి 9.9 క్వింటాళ్ల బియ్యాన్ని గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. డీటీ కలప్ప పంచనామా అనంతరం ఎరుకలి మొగులయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి ఎక్కువ ధరకు కర్ణాటకకు తరలిస్తున్నారన్నారు. మండలంలో ఎవరైనా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసినా, విక్రయించినా వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

● **ఊట్కూర్** : మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆర్ఐ రాఘవేందర్ పట్టుకొని పరిశీలించగా ఆటోలో తొమ్మిది సంచుల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. బుధవారం ఉదయం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కలప్ప పంచనామ నిర్వహించారు. బియ్యం తరలిస్తున్న మక్తల్ పట్టణానికి చెందిన వెంకటేష్, ఆటో యజమాని విక్రమ్ శివారెడ్డిలపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు ఏఎస్సై ఎండి ఖాజాసమీయోద్దీన్ తెలిపారు.

● **మద్దూర్** : మండల పరిధిలోని రెనివట్ల గ్రామ శివారులో ఎనిమిది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ మెంట్ అధికారులు పట్టుకున్నట్లు ఎస్.ఐ రాంలాల్ తెలిపారు. రెనివట్ల గ్రామానికి చెందిన సద్దాం పరిస గ్రామాల నుంచి తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించారు. ఆర్ఐ ద్వారా పంచనామ నిర్వహించి సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాంలాల్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఇటిక్యాల, జూలై 10: క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ఇటిక్యాల మండలంలోని ఉదండాపురం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఇటిక్యాల ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉదండాపురం గ్రామానికి చెందిన ముష్టిగొల్ల నర్సింహులు(32) రెండేళ్ల నుంచి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. దాంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్ద క్రిమిసంహారక మందు తాగి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. దాంతో భార్య పావని, కుటుంబీకులతో కలిసి గద్వాల ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు.

జూరాలలో మొసలి వదిలివేత



జూరాల ప్రాజెక్టులో మొసలిని వదులుతున్న పోలీసు సిబ్బంది, గ్రామస్థులు

ధరూరు, జూలై 10 : గద్వాల జిల్లా ధరూరు మండలం ఓబులోనిపల్లి శివారులోని చెరువులో దొరికిన మొసలిని పోలీసులు, గ్రామస్థులతో కలిసి బుధవారం జూరాల ప్రాజెక్టులో వదిలేశారు. స్థానికుల వివరాల ప్రకారం... ఓబులోనిపల్లి చెరువులో పెద్ద మొసలి కనబడటంతో అప్రమత్తమైన గ్రామస్థులు దానిని బంధించారు. అనంతరం గ్రామస్థులు పోలీసుల సహకారంతో మూడు చక్రాల వాహనంలో తీసుకువచ్చి కుడి జూరాల కాలువ వద్ద నదిలోకి వదిలారు. ఏఎస్ఐ వెంకటరాములు, పోలీసు సిబ్బంది, గ్రామస్థులు ఉన్నారు.

జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తించిన జితేందర్

- డీజీపీగా నియమితులు కావడంపై జిల్లా పోలీసులు హర్షం

మహబూబ్‌నగర్,జూలై 10: తెలంగాణ రాష్ట్ర డీజీపీగా నియమితులైన జితేందర్ మహబూబ్‌నగర్ ఎస్పీగా గతంలో రెండున్నరేళ్లుగా పనిచేశారు. ఆ కాలంలో పోలీస్ సంక్షేమానికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని అప్పట్లో ఆయనతో పనిచేసిన పోలీసులు గుర్తుచేసుకుంటున్నారు. ఆయన డీజీపీగా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. 1997 నవంబరునుంచి 2000 సంవత్సరం ఏప్రిల్ వరకు ఆయన మహబూబ్‌నగర్ ఎస్పీగా పనిచేశారు. అంతకుముందు ఎస్పీగా పనిచేసిన సాంబశివరావు చేత జితేందర్ బాధ్యతలు స్వీకరించారు. అయితే సాంబశివరావు ఇదివరకే ఏపీకి డీజీపీగా పనిచేయడం విశేషం. జితేందర్ హయాంలో పోలీసుల సంక్షేమానికి పలు కార్యక్రమాలు తీసుకువచ్చారు. ప్రస్తుతం జిల్లాకేంద్రంలో ఉన్న పోలీసు వినియోగదారుల స్టోర్ ఆయన హయాంలోనే ఏర్పాటు చేశారు. అదేవిధంగా పోలీసులకు గ్యాస్ గోదాం, మెడికల్ క్లీనిక్‌లను కూడా ఏర్పాటుచేయడం చేయించారు. నక్సల్స్ మూవ్‌మెంట్ ఉధృతంగా ఉన్న కాలంలో జిల్లా ఎస్పీగా పని చేసిన ఆయన మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన సిద్దాపూర్‌లో 1998 భారీ మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటుచేసి ఆ ప్రాంత ప్రజలకు పెద్దఎత్తున మందుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రజలతో పోలీసులకు సత్సంబంధాలు ఉండేందుకు పలు డిపార్ట్‌మెంట్‌లు, న్యాయవాదులు, మీడియాకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ట్రాఫిక్‌పై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రంలోనే పోలీస్ పీఆర్ వో వ్యవస్థను మహబూబ్‌నగర్ నుంచే మొదటగా ప్రారంభించారు.



డీజీపీ జితేందర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

ఉప్పునుంతల/మిడ్జిల్, జూలై 10 : రోడ్డు ప్రమాదాల్లో పలువురు వ్యక్తులు గాయపడ్డారు. ఈ ఘటనలు ఉమ్మడి జిల్లాల్లోని ఆయా మండలాల్లో బుధవారం చోటు చేసుకున్నాయి.

● నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన మందుల శ్రీకాంత్ బైక్‌పై జప్తిసదగోడు వైపు వెళ్తుండగా భైరవబండ మలుపు వద్ద బోరువెల్ వాహనం ఢీకొన్నది. దాంతో బైక్‌పై వెళ్తున్న శ్రీకాంత్ తలకు బలమైన గాయాలు అయ్యాయి. వెల్దండ సమీపంలోని ఆస్పత్రికి తరలించా రు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

● మిడ్జిల్: మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ శివారులోని అడవిపంది అడ్డురావడంతో ఆటో బోల్తా పడటంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. రాణిపేట నుంచి వెలుగొమ్ముల గ్రామానికి వస్తున్న ఆటోకు ఆకస్మాత్తుగా అడవిపందులు అడ్డురావడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటో డ్రైవర్ శ్రీనుతో పాటు వెలుగొమ్ముల ఉపసర్పంచ్ రాములుకు గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరిని జడ్చర్ల ఆస్పత్రికి తరలించారు.

పాల బిల్లులు చెల్లించాలి

- విజయ డెయిరీ ఎండీకి వినతి

కల్వకుర్తి, జూలై 10: పెండింగ్‌లో ఉన్న పాల బిల్లులను విడుదల చేయాలని పాడి రైతులు కోరారు. బుధవారం విజయ డెయిరీ ఎండీకి పాడిరైతులు వినతిపత్రం అందజేశారు. పాల బిల్లులు రాకపోవడంతో తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, స్పందించి బిల్లులు అందించాలని వినతిలో కోరారు. పశువులకు దాణా, మినరల్‌మిక్షర్, కాల్షియం అందించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం సమర్పించినవారిలో పాడి రైతులు శ్రీనివాసులు, శేఖర్‌రెడ్డి తదితరులున్నారు.



విజయ డెయిరీ ఎండీకి వినతి పత్రం అందజేస్తున్న పాడి రైతులు

బాలిక కిడ్నాప్.. కేసు నమోదు

కొత్తకోట, జూలై 10 : ప్రేమ పేరుతో బాలికలను కిడ్నాప్ చేసిన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై మంజు నాథ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మం డలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ భర్త మృతి చెందడంతో కొత్తకోట సమీపంలో పని చేసుకుంటూ (16) ఏళ్ల కూతురుతో ఉంటోంది. అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తి బాలికకు ప్రేమిస్తున్నానని మాయ మాటాలు చెప్పి తీసుకెళ్లాడు. తల్లి ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై కిడ్నాప్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నాబార్డు నిబంధనల మేరకే గోదాము నిర్మాణం



విలేకరులతో మాట్లాడుతున్న బాదేపల్లి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్

జడ్చర్ల, జూలై 10 : బాదేపల్లి ప్రాథమిక సహకార సంఘానికి నాబార్డు మంజూరు చేసిన రుణంతో నాబార్డు నిబంధనల మేరకే గోదాము నిర్మాణం చేపట్టామని, ఎలాంటి అవకతవకలు జరగలేదని బాదేపల్లి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. సహకార సంఘం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది సహకారసంఘం ఆధ్వర్యంలో ఫర్టిలైజర్స్ విక్రయాలు జరిపామని, అందులో రూ.3లక్షల37వేలు అవకతవకలు జరిగాయని ఆ అంశంపై విచారణ చేపట్టిన అధికారులు సంఘం సీఈవో యాదగిరికి సర్‌చార్జ్ నోటీసును జారీ చేశారన్నారు. అలాగే కాంట్రాక్ట్ ఉద్యోగికి ఫర్టిలైజర్స్ విక్రయాలు నిర్వహించేలా నిర్ణయం తీసుకున్నట్లుగా సహకారసంఘం సభ్యులు తీర్మాణం చేసినట్లుగా తప్పుడు పత్రాలు సృష్టించాడని ఆరోపించారు. మంగళవారం సహకారసంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించుకున్నామని, సహకార సంఘం సీఈఓ యాదగిరిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ తీర్మాణం చేశామని, ఆ మేరకు ఉత్తర్వులను అందజేయనున్నట్లు వెల్లడించారు. గోదాము నిర్మాణంలో చేపట్టిన పనులకు సంబంధించిన ఎంబి రికార్డు మేరకే బిల్లులు వచ్చాయని వివరించారు. నాబార్డు రుణం సైతం అడ్వాన్స్‌గా ఇవ్వలేదని, జరిగిన పనులను అధికారుల పర్యవేక్షణ అనంతరమే బిల్లులు మంజూరు చేశారని వివరించారు. నిర్మాణానికి సంబంధించిన అంశంలో పూర్తి బాధ్యత తనదేనని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు రఘురాంరెడ్డి ఉన్నారు.

పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలి



కార్మికశాఖ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన భవన నిర్మాణ కార్మికులు

నారాయణపేట టౌన్, జూలై 10 : భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిమ్‌లు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డెలివరీ, డెత్, మ్యారేజ్ గిఫ్ట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సంక్షేమ పథకం ద్వారా వచ్చే డబ్బులను వెంటనే మంజూరు చేయాలని, గత మూడు నాల్గు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అనేక కారణాలచే లబ్ధిదారులకు బెనిఫిట్స్ ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచడం సరైంది కాదన్నారు. ఆన్‌లైన్ సర్వీస్ సమస్యను పరిష్కరించాలని కోరారు. జిల్లా నాయకులు నరసింహా, రాము, చెన్నప్ప, కనక రాయుడు, నారాయణ, తిమ్మన్న పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల దీక్షలు

నారాయణపేట, జూలై 10 : 60 ఏళ్ల పైబడిన అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని అంగన్‌వాడీలు చేపట్టిన రిలే దీక్షలు బుధవారం ఐదో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దస్తప్ప, ఎస్‌ఎఫ్‌ఐ మల్లేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు రూ.రెండు లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష ఇవ్వడంతో పాటు నెలసరి వేతనంలో సగం పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మమ్మ, లక్షమ్మ, బాలమ్మ తిమ్మమ్మ, నర్సింగమ్మ మౌలాన పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలి

నారాయణపేట న్యూటౌన్, జూలై 10 : ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం నారాయణపేట ఎంఈవో కార్యాలయ సిబ్బంది నారాయణకు వినతి పత్రం అందజేశారు. అఖిల భారత కార్మిక దినం సందర్భంగా వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడికి సన్మానం



హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్, జూలై 10 : మండలంలోని బోయిన్‌పల్లిలో పని చేస్తున్న హెచ్‌ఎం బనదయ్య బదిలీపై దామరగిద్ద మండలం మొగల్‌మడ్క జడ్పీహెచ్‌ఎస్‌కు బదిలీ కావడంతో బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు శాలువా, పూలమాలతో సన్మానించారు. ఆరేళ్లుగా పాఠశాలలో బనదయ్య చేసిన సేవలను వారు కొనియాడారు. విధి నిర్వహణ, సమయపాలనలో తనకం టూ సాటిలేరన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఎం.వెంకటయ్య, మల్లేష్‌యాదవ్, గాంధీ వెంకటయ్య, మాజీ విద్యా కమిటీ చైర్మన్ ఎ.వెంకటయ్య, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, శ్రీలత, అంగన్‌వాడీ కార్యకర్త అనంతమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్వకు బస్సు పునరుద్ధరణ

నర్వ, జూలై 10 : మండల కేంద్రానికి వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును పునరుద్ధరిస్తున్నట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. ఈ సంద్భంగా బుధవారం బస్ రూట్ పరిశీలనలో భాగంగా మండల కేంద్రంలో గ్రామస్థులతో మాట్లాడారు. స్కూల్ విద్యార్థులకు ఈ బస్సు ఏ మేరకు ఉపయోగపడుతుందని తెలుసుకున్నారు. అవసరమైన గ్రామాలకు బస్సులను వీలైనంత వరకు నడుపుతామన్నారు. అనంతరం బస్సు రెగ్యులర్‌గా నడవాలంటే తగినంత కలెక్షన్ ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు శంకర్, నాగిరెడ్డి, పల్లె వెంకటయ్య, నరసింహా గౌడ్, ఎండీ ఖాదర్, బుడ్డల భాస్కర్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు

» విద్యార్థుల ఆట పాటలు



ఉపాధ్యాయులు లేక ఆటలాడుతున్న విద్యార్థులు

మాగనూరు, జూలై 10 : మండలంలోని పెగడబండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఆరు బయట ఆటలాడుతున్నారు. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయుడు పదోన్నతిపై వెళ్లడంతో ఆ స్థానం ఖాళీ అయ్యింది. తాత్కాలికంగా మరో ఉపాధ్యాయుడు వెళ్లాలని చెప్పినా రాకపోవడంతో విద్యార్థులు చదువుకు దూరమయ్యే అవకాశం ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ విషయంపై సీఆర్పీ కృష్ణయ్యను వివరణ కోరగా పాఠశాలలో ఉపాధ్యాయుడు లేని మాట వాస్తవమే అని తెలిపారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

మక్తల్, జూలై 10 : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఎలాంటి షరతులు విధించకుండా ఏక కాలంలో రూ.రెండు లక్షల రైతు రుణమాఫీ చేయాలని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం రాష్ట్ర నాయకుడు యాదగిరి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీతో పాటు రైతుబంధు, వరికి రూ.500 బోనస్, పంటల బీమా వంటి పథకాలు అమలు చేయాలన్నారు. జూలై 22 నుంచి 29 వరకు రైతాంగం సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. భూ సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా చూడాలన్నారు. ప్రతీ రైతుకు పదెకరాల వరకు రైతు భరోసా, కౌలు రైతులకు సైతం రైతు భరోసా, అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్, ఉచితంగా ఎరువులు అందించాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు భగవంతు, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, నాయకులు ఆనంద్, రాజు, ఆంజనేయులు, లక్ష్మణ్ణ, మహిమూద్, లోకేష్, గోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మత్స్యకార దినోత్సవం



మక్తల్‌లో కేక్ కట్ చేస్తున్న మత్స్య సహకార సంఘం సభ్యులు

మక్తల్, జూలై 10 : మక్తల్ పట్టణంలోని మత్స్య సహకార పారిశ్రామిక భవనంలో బుధవారం జాతీయ మత్స్య సహకార దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముదిరాజ్, మత్స్య సహకార సంఘం నాయకులు కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్య సహకార సంక్షేమం కోసం మరిన్ని పథకాలు తీసుకురావాలన్నారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మత్స్య సహకార సంఘం సభ్యులు డాక్టర్ శ్రీరామ్, తిరుపతి నర్సిములు, వాకిటి శ్యామ్, లొడ్డ ఆంజనేయులు, కావలి శ్రీహరి, తిరుపతి, నర్సింహులు, వల్లంపల్లి లక్ష్మణ్, కావలి ఆంజనేయులు, చందాపూర్ చంద్రశేఖర్, కట్ట వెంకటేష్, కర్ని గోపి, మామిళ్ల బుగ్గప్ప, వల్లంపల్లి మధు, గురు ప్రవీణ్ పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీ పారదర్శకంగా చేపట్టాలి

నారాయణపేట టౌన్, జూలై 10 : జిల్లాలో చేప పిల్లల పంపిణీని పారదర్శకంగా చేపట్టాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజ్ అన్నారు. జాతీయ మత్స్యకార దినోత్సవం సందర్భంగా జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్య కార్మికులకు బీమా వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు కాంత్‌కుమార్, నీరటి నర్సింహులు, రామకృష్ణ, ఆనంద్, రిషికుమార్, కొనంగేరి హన్మంతు, శంకర్, వెంకటేష్, వెంకటప్ప, నర్సింహులు పాల్గొన్నారు.

పక్కాగా పంటల సర్వే

» పొలం బాట పట్టిన ఏఈవోలు » ఆన్‌లైన్‌లో పంటల వివరాలు నమోదు



మరికల్‌లో సాగైన పత్తి పంట



పంట వివరాలు నమోదు చేసుకుంటున్న ఏఈవో

నారాయణపేట, జూలై 10 : వానాకాలం పంటల సాగు వివరాలను వ్యవసాయాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లా వ్యవసాయాధికారి జాన్ సుధాకర్ ఆధ్వర్యంలో జిల్లాలోని 13 మండలాల్లో వ్యవసాయాధికారులతో పాటు 77 మంది ఏఈవోలు పొలాల బాట పట్టారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి ఎంత విస్తీర్ణంలో ఏ ఏ పంటలు సాగు చేశారనే అంశాన్ని పరిశీలిస్తూ ఆన్‌లైన్‌లో నమోదు చేసే పనుల్లో బిజీగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత వానాకాలంలో 4.20 లక్షల ఎకరాల్లో వివిధ పంటల సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, ఇప్పటి వరకు 3,40,054 ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేశారు. ప్రస్తుతం వరి 1,30,000 ఎకరాల్లో నారుమళ్లు వేశారు. పత్తి 1,45,198 ఎకరాల్లో సాగైంది. కంది 42,345 ఎకరాల్లో సాగవగా, ఈ నెలాఖరు వరకు మరింతగా పెరిగే అవకాశం ఉంది. జొన్న 4,303 ఎకరాల్లో, పెసర 3,548 ఎకరాల్లో, జీలుగ 14,700 ఎకరాల్లో సాగు చేశారు. పంటల సాగు ఆన్‌లైన్ నమోదులో రైతుకు సంబంధించిన సర్వే నంబర్, సాగు చేసిన పంటల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేస్తున్నారు. ఆకస్మికంగా క్షేత్ర స్థాయిలో జిల్లా వ్యవసాయాధికారి, మండల వ్యవసాయాధికారులు పంట పొలాలను సందర్శించి ఏఈవోలు నమోదు చేస్తున్న పంటల ప్రక్రియను పరిశీలించడంతో పాటు వివరాలు పక్కాగా నమోదు చేయాలని సూచిస్తున్నారు. కాగా సెప్టెంబరు 15 వరకు పంట సర్వే కొనసాగనుంది.

ఎన్ని కుట్రలు పన్నినా.. ప్రజలు ఆదరించారు

» మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



సమావేశంలో మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

కోస్గి, జూలై 10 : నన్ను ఓడించేందుకు పాలమూరు పార్లమెంటులో ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు ఆదరించారని పాలమూరు ఎంపీ డీకే అరుణ అన్నారు. బుధవారం కోస్గి పట్టణంలోని రామాలయం, హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా ఏబీకే ఫంక్షన్ హాల్‌కు చేరుకున్నారు. ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో మాట్లాడారు. పాలమూరు పార్లమెంట్‌లో నన్ను ఓడించాలని ఎంతోమంది కుట్రలు చేశారని, ప్రజలు వారి కుట్రలను తిప్పికొట్టి నిరంతరం ప్రజల మధ్య ఉండే డీకే అరుణను గెలిపించారన్నారు. ఈ ప్రాంతానికి తాను మంత్రిగా ఉన్నప్పుడు కూడా ఎంతో మేలు చేశానన్నారు. ప్రజల మధ్య ఉండే నాయకులను ప్రజలు ఎప్పుడు ఆదరిస్తారన్నారు. ఎన్నికల వేళ కొడంగల్‌లో నాయకులను కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసినా కార్యకర్తలు భయపడకుండా నా వెంట నిలిచి నా గెలుపునకు కృషి చేసినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు అధైర్య పడొద్దని అండగా ఉంటానన్నారు. అంతకుముందు వేద ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఫుడ్ ఫెస్టివెల్ కార్యక్రమంలో పాల్గొని, విద్యార్థులతో మాట్లాడారు.

యానగుందిలో ప్రత్యేక పూజలు

నారాయణపేట : జిల్లా సరిహద్దులోని మాతా మాణికేశ్వరి మాణిక్యగిరి కొండపై బుధవారం మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతా మాణికేశ్వరి ట్రస్ట్ కార్యదర్శి శివయ్య స్వామి, ట్రస్ట్ సభ్యులు కృష్ణ కోర్‌వార్ ఎంపీకి స్వాగతం పలికారు. అదే విధంగా కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ ఎంపీ రాధాకృష్ణ, ఎమ్మెల్సీలు రాజశేఖర్ పాటిల్, జయదేవ్ గుత్తేదార్, మెడికల్ ఎడ్యుకేషన్ మినిస్టర్ శరణ్‌ప్రకాష్ పాటిల్ మాణిక్యగిరి కొండపై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వారంలోపు ధరణి సమస్యలు పరిష్కరించాలి

» కలెక్టర్ సిక్తా పట్నాయక్



ఆర్డీవో కార్యాలయంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, జూలై 10 : వారంలోపు ధరణి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆర్డీవో మధుసూదన్‌ను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్డీవో కార్యాలయంలోనే ధరణికి సంబంధించిన సమస్యలు ఎక్కువ పెండింగ్‌లో ఉన్నాయని, ఓ ఒక్క ఫైల్ కూడా పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్ రాణాప్రతాప్ పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంలతో పదో తరగతి ఫలితాలపై సమీక్ష నిర్వహించి మాట్లాడారు. సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, నాగార్జునరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని చేరుకోవాలి

నారాయణపేట రూరల్ : విద్యార్థులు ఇష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని జాజాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, బోధన, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో మమేకమయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి శిక్షణ ఎలా పొందాలో తెలియజేశారు. విద్యార్థులకు గుడ్లు ఇచ్చారా? అని తెలుసుకున్నారు. వంట గదిని పరిశీలించారు. శ్యామ్ అండ్ మామ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి బరువు తక్కువ ఉన్న విద్యార్థులకు పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. కలెక్టర్ స్వయంగా పిల్లల బరువు, ఎత్తులను పరిశీలించారు. డీఈవో అబ్దుల్ ఘనీ, ఎస్‌వో శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్వేయర్లకు మెమో జారీ చేయండి

» తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఆర్డీవో

కోస్గి, జూలై 10 : జిల్లా అధికారులు ఆదేశించినా ప్రభుత్వ భూము లు, చెరువులు సర్వే చేసి రిపోర్టులు ఇవ్వకపోవడం ఏంటని వెంటనే సర్వేయర్లకు మెమో జారీ చేయాలని ఆర్డీవో మధుమోహన్ తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ప్రభుత్వ భూములు కొలవడం లేదని పలువురు ఆర్డీవోకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆయన వెంటనే తహసీల్దార్ శ్రీనివాసులుతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రభుత్వ భూములు, ముఖ్యంగా రేకులకుంట కొలవమని ఆదేశాలు ఇచ్చినా ఎందుకు కొలవలేదని మండిపడ్డారు. సర్వేయర్లు సరిగా పనిచేయడం లేదని చెప్పడంతో వెంటనే మెమో జారీ చేసి మూడు రోజుల్లో సర్వే రిపోర్టులు ఇవ్వాలని ఆదేశించారు. దీంతో తహసీల్దార్ కోస్గి సర్వేయర్ అరుణకు మెమో జారీ చేశారు. వెంటనే ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూమి రేకులకుంట కొలిచి నివేదిక ఆర్డీవోకు అందించాలని కోరారు.

పంట నమోదు పరిశీలన

కోస్గి రూరల్, జూలై 10 : మండలంలోని కొత్తపల్లి గ్రామంలో పంట నమోదు ప్రక్రియను జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పత్తి, జీలుగ పంటలను సందర్శించి, రైతులకు సూచనలు చేశారు. సాంకేతిక పరమైన సూచనల గురించి వ్యసాయ అధికారులను సంప్రదించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన

కృష్ణ, జూలై 10 : మండలంలోని కున్సి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం మహిళా చట్టాలపై షీ టీం పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లల నడవడికపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో అపరిచిత వ్యక్తులు పోస్టులు, లింకులు పెడితే స్పందించరాదన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930కి సమాచారం అందించి తక్షణ సహాయం పొందాలన్నారు. కార్యక్రమంలో షీ టీం బృందం సమీనా, బాల్‌రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఎస్సీ వాయిదా వేయండి

- సోషల్ మీడియాలో దామరగిద్ద అభ్యర్థి వీడియో వైరల్

దామరగిద్ద, జూలై 10 : డీఎస్సీ వాయిదా వేయాలని మండలంలోని ఉల్లిగుండం గ్రామానికి చెందిన డీఎస్సీ అభ్యర్థి జి.పద్మ ప్రభుత్వాన్ని విన్నూత్నంగా వీడియోలో కోరారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. తాను 2017లో డైట్ పూర్తి చేశానని, ఇప్పటి వరకు నాలుగు సార్లు టెట్ రాసి ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. టెట్‌లో 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొంది. డీఎస్సీకి 20 రోజుల సమయం ఉన్నందున చదువుకోవడానికి ఇంకా సమయం ఇవ్వాలని అందుకోసమే పరీక్షను వాయిదా వేయాలని, నీ కాళ్లు మొక్కుతా సార్ అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతూ మాట్లాడిన వీడియో వైరల్ అవుతోంది.

బాలికల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరహరి

మరికల్, జూలై 10 : మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరహరి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలించి, మాట్లాడారు. విద్యార్థినులకు టాయిలెట్స్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలలో 275 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తుండగా, మధ్యాహ్న భోజనం కూడా నాణ్యతగా లేకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచి టిఫిన్ బాక్సులు తీసుకరావడం జరుగుతుందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పది నెలలుగా పెండింగ్ బిల్లులు రాకపోవడంతో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు చెల్లించాలన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

» తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ, ఆశ వర్కర్ల ఆందోళన » తహసీల్దార్లకు వినతిపత్రం అందజేత



మక్తల్‌లో డీటీకి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు



ఊట్కూర్‌లో తహసీల్దార్ మమతకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

మక్తల్, జూలై 10 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ గోవిందరాజు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడం విడ్డూరం అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.రెండు లక్షలకు పెంచాలన్నారు. అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన కార్మికులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు స్కీంలు అమలు చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్, మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం డీటీ శ్రీదేవికి వినతి పత్రం అందించారు. అంగన్‌వాడీ జిల్లా కార్యదర్శి మంజుల, విజయ లక్ష్మి, రాధిక, గోవిందమ్మ, యశోద, సుజాత, లక్ష్మి, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు సురేఖ, లక్ష్మి, గోవిందమ్మ, మణెమ్మ, శ్రీలత, మంజుల, భాగ్యలక్ష్మి, రాధిక, లలిత, అంబిక, ఉమాదేవి, రాజేశ్వరీ, యాదమ్మ, ముంతాజ్‌బేగం పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

నారాయణపేట : కేంద్రం తీసుకొచ్చిన నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేసి కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు వీరాంజనేయులు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దస్తప్ప డిమాండ్ చేశారు. బుధవారం నారాయణపేట మునిసిపల్ పార్కు దగ్గర ఆశ వర్కర్లు, కార్మికులు చేపట్టిన ధర్నాను ఉద్దేశించి వారు మాట్లాడారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని డీటీ నారాయణకు అందించారు. కార్యక్రమంలో మంజుల, విజయలక్ష్మి, రాధిక, మమత, ఉమ, స్రవంతి పాల్గొన్నారు.

● నర్వ : చాలీచాలని వేత నంతో పని చేస్తున్న ఆశ వర్కర్ల డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని బుధవారం ఆశ వర్కర్లు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. వీరికి మద్దతు గా సీఐటీయూ జిల్లా నాయకుడు కాశీనాథ్ మద్దతు పలికారు. కార్మికులకు నష్టం కలిగించే నాలుగు కార్మిక కోడ్‌లు కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని, అదే విధంగా అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలన్నారు.

● మరికల్ : సీఐటీయూ జిల్లా నాయకుడు బాలప్ప ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశలకు నిర్వహించే పరీక్షలను రద్దు చేసి, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, అంగన్ వాడీలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రెండు లక్షలకు పెంచాలన్నారు. కార్యక్రమంలో భారతమ్మ, లక్ష్మమ్మ, సునంద, అనిత, గాయత్రి, వరలక్ష్మి, ఆశ వర్కర్లు కవిత, సులోచన, అనురాధ పాల్గొన్నారు.

● మాగనూరు : కార్మికులను బానిసత్వంలోకి నెట్టే నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయడంతో పాటు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అందించాలని సీఐటీయూ నాయకుడు భరత్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన చేపట్టగా ఆయన మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ సతీష్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు సూర్యప్రకాశ్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు శివకుమారి, శోభ, నీలమ్మ, గౌరమ్మ, శాంతమ్మ, లక్ష్మీదేవమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

● దామరగిద్ద : అంగన్‌వాడీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ మండల నాయకుడు జోషి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాధ, నాగజ్యోతి, వసంతబాయి, అమరావతి, అమృత, వెంకటమ్మ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

● ఊట్కూర్, : కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఎన్‌హెచ్‌ఎం స్కీం రక్షించాలని, ఆశ కార్మికులను గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ సీఐటీయు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం కోర్కెల దినం నిర్వహిస్తు ఊట్కూర్ తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఆశ కార్యకర్తలకు నష్టం కలిగించే పరీక్షలను రద్దు చేయాలని, ప్రతీ నెల రూ.10 వేల పింఛన్ ఇవ్వాలన్నారు. సీఐటీయూ మండల కన్వీనర్ నారాయణ మాట్లాడుతూ ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 45వ ఐఎల్‌సీ తీర్మానం చేసిన పీఎఫ్, ఈఎస్‌ఐలను అమలు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ మమతకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు సంధ్యరాణి, షెహెజాది, శివమ్మ, బాలమణి, పద్మమ్మ, జైనబ్ బీ, సాబేరా పాల్గొన్నారు.

● మద్దూర్ : అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. కార్మికుల కోరికల దినం సందర్భంగా పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని బుధవారం తహసీల్దార్ మహేశ్‌గౌడ్‌కు అందించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.రెండు లక్షలు, ఆయాలకు రూ.లక్ష ఇవ్వాలని, పింఛన్ అందించాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో ఆ సంఘం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శశికళ, అంజమ్మ, కళావతి, సులోచన, వీవోల సంఘం నాయకులు శ్రీనివాస్, నరహరి, కనకప్ప, బుగ్గప్ప పాల్గొన్నారు.





దామరగిద్దలో తహసీల్దార్‌కు, నారాయణపేటలో డీటీ నారాయణకు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు